# పరబ్రహ్మము

ప్రాతఃకాలమైంది. స్నానంచేసి సంధ్యవార్చడానికి ప్రశస్తమైన వేళ. చీకటీ వెలుతురూ బజారువెనక వీధిలో విషవాయు ప్రయోగాలు చేసుకుంటూ ద్వంద్వయుద్ధం చేసుకుంటున్నాయి.

"ఓంఓంఓం!" అంటూ దోమలు ప్రణవాన్ని పవిత్రంగా పునశ్చరణ చేసుకుంటున్నాయి. నెలగంటుపెట్టిన తరవాత సంక్రాంతి ముందు రోజులు. మంచుపొగలాగ ఆవరించి అరుణోదయ రోచుల్ని దిగమింగుతున్నాది.

ఇదంతా బజారు వెనక వీధిలో, వీధంటే వీధికాదు. చూసి తీరవలసిన వీధి. వీధిలోకి ఒక్క సింహద్వారమైనా లేదు. అన్ని పెరళ్ళ వెనక మరుగుదొడ్డి గుమ్మాలే! కొన్ని దొడ్లకి తలుపులైనా లేవు. చింకిగోనెలు వేళ్ళాడగట్టారు. వీధికి రెండువైపులా యధావిధిగా మురికికాలువలు మాత్రం వున్నాయి. వాటిలో నీలిరంగు నీళ్ళు అహోరాత్రాలు పాడుకుంటూ ప్రవహిస్తాయి.

చేత్తో తట్ట ఎగరేసి పట్టుకుంటూ, చంకతో చీపురుకట్టనొక్కి పట్టుకొని, పాకీ జవరాలు పొగమంచులోంచి బజారు వెనకవీధిలోకి ప్రవేశించింది. మరుగుదొడ్డి బొండీమీద కూచున్న పిచ్చివాణ్ణి పాకీ జవరాలు వికృతంగా చూసింది. పాకీ జవరాలు రోజూ ఆ పిచ్చివాణ్ణి వికృతంగా పొద్దున్న చూస్తూ ఉంటుంది. జవరాలిని చూడగానే పిచ్చివాడు భయపడిపోయి, రెండుచేతుల్తో మొహం మూసేసుకుంటాడు. వేళ్ళసందుల్లోంచి దొంగతనంగా దాన్ని చూస్తూ ముడుచుకుపోతాడు.

నడ్డిమీద బరువుగా తట్టపెట్టుకుని, నోట్లో మూరెడు చుట్టపెట్టి, అడ్డపొగ పీలుస్తూ పాకీది మెల్లిగా బజారు వెనకవీధిలోంచి వెళ్ళిపోతూ ఉంటే, పిచ్చివాడు బొండీమీంచి దిగి, రోడ్డుమీద నిలబడి వెనకతట్టునుంచి

జవరాలిని తీక్షణంగా చూస్తాడు. సరిగ్గా ఆ వేళకి పిచ్చివాడికి అనునిత్యం సూర్యోదయమై రోజు తెల్లారుతుంది.

ఆవేళ సూర్యోదయం కాలేదు. మంచుతెర బిగుసుకు పోయింది. మంచు చినుకుల చిరివర్షం వేపపువ్వులా దట్టంగా రాలుతున్నది.

పిచ్చివాణ్ణేదో బాధపెడుతున్నాది. కారణం తెలియని బాధ వాణ్ణి కాల్చుకు తింటున్నాది. ఈ పరిస్థితి వాడికి తరచు సంభవిస్తూ ఉంటుంది. అప్పుడు రోడ్డు మధ్య నిలబడి, గగ్గోలుపెడుతూ ఏడుస్తాడు. ఆ వేళ కూడా ఏడ్చి ఏడ్చి అలసిపోయాడు. ఏడుపుమాని పేలాపనలోకి దిగాడు. శీతగాలికి పిడచ కట్టుకుపోతున్న నాలికని చేటలాగ సాగదీసుకొంటూ, బూతుల్ని చెరగడం ప్రారంభించాడు

పొగమంచు చాందినీలాగ నాలుగుపక్కలా వేళ్ళాడుతూ వాడి చుట్టూ గుడారం లాగుంది. పిచ్చివాడు బండిచక్రాల్లా కళ్ళని చేసుకుని పొగమంచుని దృష్టులతో చీల్చుకుంటూ గమనిస్తున్నాడు. వాడు భయపడుతూనే చూస్తున్నాడు. వాడు భయపడ్డంతా అయింది. తెరమీద చలన చిత్రంలాగ మంచుమీద తెల్లని ఆకారం ఏదో కదలడం ప్రారంభించింది. పొద్దున్నే బజారు వెనక వీధిలోకి వచ్చి రాలిన తొగరాకులు మేస్తున్నాది తెల్లని ఆవుదూడ!

"నీ యమ్మ శిఖకొయ్య! వచ్చా?" అంటూ పిచ్చివాడు పరిగెట్టేడు. వాడికి కోపం చలిజ్వరంలాగ వుదుపుతో ముంచుకొచ్చింది. వాడి కోపం కనుబొమ్మల మధ్య పీటముడిబడ్డాది; బుగ్గనమీద గెద్దగోళ్ళలాగ ముడతలు తేలింది.

బజారు వెనకవీధిలోకి, పశుపక్ష్యాదులు రావడానికి వీల్లేదని పిచ్చివాడి శాసనం. దాన్నతిక్రమించి వస్తే పిచ్చివాడు వెంటనే యుద్ధం ప్రకటిస్తాడు.

దూడమీదకి మెల్లిగా అడుగులు వేస్తూ వెళ్లాడు. దానికి పిచ్చివాడి తడాఖా తెలిసినట్టే వుంది. మెళ్ళో మువ్వలు గిల్లుగిల్లుమని మోగిస్తూ, తోకెత్తుకొని అదొక్క దూకుదూకింది. అనూంతంగా పిచ్చివాడు దానిమీదపడి వెనుకకాలు గట్టిగా పట్టుకున్నాడు. దూడదూడంతా కాళ్లుజారి సగం కాలువలోకి సగం రోడ్డుమీదికీ బోర్లాపడ్డాది. పిచ్చివాడూ కూడా తూకంతప్పి తిరగబడి లేచినిలుచున్నాడు. దూడ మక్కజారి ఎంత కూడదీసుకున్నా కాళ్ళు

స్వాధీనంగాక గింజుకుంటున్నాది. పిచ్చివాడికి పరమానందమైంది. దాని బాధని చూస్తూ చాలాసేపు ఎదురుగా నిలబడి ముసిముసినవ్వులు నవ్వాడు. తరవాత పచారులు ప్రారంభించాడు. ఏదో తెలియనిబాధ లోపలినుంచి వాణ్ని వేధించుకు తింటున్నాది. గాలి రువ్వురువ్వుమని రివటలు రివటలుగా వొస్తున్నాది. పిచ్చివాడి దవడలు స్వాధీనం తప్పి వడవడ లాడుతున్నాయి. పళ్ళు వాటంతటవే కొట్టుకొంటున్నాయి. వాడి బుద్ధి అకస్మాత్తుగా వికసించింది.

"అబ్బా చలీ!" అని అనుకొన్నాడు. ఆలోచన చిక్కుడు తీగలాగ శీతగాలికి పువ్వు తొడిగింది.

"చలీ! వొంటినిండా బట్ట, కడుపునిండా తిండిలేకపోతే ఎలాగ? కొనుక్కోవాలి. రగ్గు, రగ్గులు ప్రియమంటారా? అయితే అవుతుంది. కొన్నప్పుడు శుభ్రమైనదే కొనుక్కోవాలి. తప్పవురా బాబూ తద్దినాలు తప్పవు. వెయ్యిచెప్పు నూరుచెప్పు దరిద్రం దరిద్రంలాగ దండుగ దండుగలాగ! దానమ్మా శిఖా కోసిరి!" అని బయలుదేరాడు. విశాలమైన వీధుల్లో కెళ్ళాడు.

మంచు ముసుగులో ఇళ్ళన్నీ అయోమయంగా ఉన్నాయి. వీధి వాకళ్ళ పేణ్ణీళ్లు జల్లి సంక్రాంతి ముగ్గులు పెడుతున్నారు. అనేకులు వీధరుగులమీద కూర్చుని మొహాలు కడుగుతున్నారు. మొగాళ్ళకన్నా ఆడవాళ్లే ఎక్కువగా కనబడుతున్నారు.

"అమ్మమ్మమ్మ! ఆడవాళ్ళు! బాబో వీళ్ళని భరించాలి! మొగాడు కష్టపడి గణించి తెస్తే కమ్మగా భోజనం చేసి, లేసులు కుట్టుకుంటూ కూచుంటారు!" అని పిచ్చివాడు వ్యాఖ్యానించాడు. సహేతుకమైన ఆలోచనతో వీధిని పర్యవేక్షణ చేస్తున్నాడు. కొన్ని తలుపులింకా తియ్యనే తియ్యలేదు.

"వెధవలు! వీళ్ళకేం? కిటికీలు సహా బిడాయించుకొని పడుకొన్నారు! పదైపోయినా పక్కమీదే! వెచ్చగా పడుకోండి. మీ యమ్మా శిఖాకొయ్యా! ఆఫీసు కెళ్ళాలా? డబ్బులేదని జోలిపుచ్చుకోవాలా?" అని అనుకొన్నాడు.

ఎత్తరుగుల ఇంటి వీధి తలుపులు రెండు బార్లా తెరిచివున్నాయి. సావిట్లో మనుషులజాడ లేదు. పిచ్చివాడు మెట్లెక్కి సావిట్లోకి వెళ్లాడు. సావిట్లో పాగాకొయ్యలమీద ప్లీడరుగారి లాంకోట్లు వేళ్ళాడుతున్నాయి. వాటికోసమే పిచ్చివాడు బయలుదేరి వచ్చింది. పిచ్చివాడు కోటుతీసి తాపీగా తొడుక్కున్నాడు. సరిగ్గా సవరించుకొని, ఒక్కొక్క గుండీ ఆ చివరినుంచి ఈ చివరిదాకా పెట్టుకున్నాడు.

ఎదురుగా వరండాలో ఎనిమిది తొమ్మిదేళ్ల కుర్రాడు పిల్లిపిల్లని వొళ్ళో పెట్టుకుని ఆడుకుంటున్నాడు. పిచ్చివాణ్ని పిల్లాడు చూశాడు.

"నాన్నోయ్! పిచ్చాడు!" అని కేకేశాడు. వాళ్ళనాన్న సావిట్లోనే కూర్చున్నాడు. మొహానికి అడ్డంగా గళాసు పెట్టుకుని వేడివేడి కాఫీ ఒక్కొక్క గుక్కా మింగుతూ ఆయనగారు పిచ్చివాడు రావడాన్ని చూడనే లేదు. కొడుకు కేకెయ్యగానే చూసి గతుక్కుమన్నాడు.

"చలి! కోటైనా లేకపోతే ఎలాగ? నీకేం ఎర్రగా కొంప మునిగి పోయినట్టు చూస్తున్నావు. కోటు లేకపోతే ఎలాగనుకున్నావు?" అని ప్లీడరుగారిని ప్రశ్నించాడు.

"కోటు విప్పి అక్కడ పెడతావా తన్నమన్నావా?" అని ప్లీడరుగారు గద్దించారు. ఇంట్లోంచి బంట్రోతు పరిగెట్టుకొచ్చాడు. పిచ్చివాడి రెక్కపట్టుకొని "విప్పు" అన్నాడు. బంట్రోతుని ఒక్క జాడింపు జాడించి విడిపించుకున్నాడు. వాడు బాగా దుక్కతన్ని వస్తాదు లాగున్నాడు. బంట్రోతు భయపడి వెనక్కి నిలబడిపోయాడు.

"ఒరే బంట్రోతు వెధవ!" అన్నాడు పిచ్చివాడు.

"పటుకో చూస్తావేమిటి? కోటులో పర్సు పెన్నుకూడా వున్నాయి" అన్నాడు ప్లీడరుగారు. ఆయనగారు గట్టిగా మాట అంటున్నాడుగాని ముందుకి అడుగుమాత్రం వెయ్యలేదు.

"పెన్నా? వెధవ పెన్ను" అని పెన్నుతీసి ప్లీడరుగారిమీద విసిరేశాడు.

"పర్సా? వెధవడబ్బు" అని పర్సుతీసి విసిరేశాడు. ఈ గందరగోళం విని ప్లీడరుగారి తల్లి ఇంట్లోంచి బైటికి వచ్చింది. ముసలమ్మ పిచ్చివాడ్ని ఎరుగును. పిచ్చివాడు ముసలమ్మనీ ఎరుగును. ఊరందర్నీ

వాడు ఎరుగును. వాణ్ణి ఊరంతా ఎరుగును. అందరి కళ్ళ ముందరా పుట్టి పెరిగినవాడే.

"అయ్యో! వెర్రినాగమ్మా కోటు తొడిగేసుకొన్నావా? ఇహ నా కోటు వాణ్ణి ఇబ్బందిపెట్టి తీసుకోకండి. ప్రాణికి ఎంత చలేసిందో. పాత కోటే కదా?" అన్నది ముసలమ్మ.

"బాబూ ఇంత చద్దన్నం పెడతాను తింటావా?" అన్నది ముసలమ్మ.

"నా కక్కర్లేదు అన్నం. నేను పదిమందికి పెడతాను. ఐతే ఒక్కటే ఇంకా అదృష్టం కలసిరాలేదు" అని ముసలమ్మకి చెప్పి పిచ్చివాడు మెల్లగా వీధిలోకి బయలుదేరాడు. యథాప్రకారం బజారువెనక మురుగుదొడ్ల వీధిలోకి పచార్లుచేస్తూ కోటును తెగచూసుకున్నాడు.

మక్కజారిన దూడ సగం కాలువలోపలికి, సగం రోడ్డుమీదికి పడి లేవలేక ఇంకా గిలగిల్లాడుతున్నది.

అరుస్తూ వీధిలో కాకులు మూగాయి. వాడికి రిమ్మెత్తుకొచ్చింది. హుష్షులతో తోలేడు. ఎన్నిసార్లు తోలినా అవి అక్కడకక్కడే వాలి కావు కావు మంటు చెవులు చిల్లులు పెడుతూ చికాకు పరుస్తున్నాయి.

"వెధవ కాకులు? భరతం పట్టిస్తాను; కొట్టిన కాకినే కొట్టదట పేద రాసిపెద్దమ్మ పెద్దమ్మకొడకా. కొడుకుచేతి గొడ్డలా! ముక్తపదగ్రస్తంకదూ అలంకారం? ఔను కాబోలు! నాకు తిన్నగా తెలియదు. నేను పండితుండను కాదు. పాండిత్యం ఎక్కువైతే బుద్ధికి పడిశం పడుతుంది. ఎందుకొచ్చిన పాండిత్యాలు? కూటికొస్తాయా? గుడ్డకొస్తాయా?

కనకాభిషేకమేమైంది? కస్తూరిసేవయేమైంది? నీ ఢక్కాబద్దలు కొడతానురా డిండిమభట్టూ! నీయమ్మా శిఖాకొయ్యా! దానమ్మా శిఖాకొయ్య కృష్ణవేణమ్మ కొట్టుకపోయింది. శ్రీకృష్ణార్పణమస్తు! బతుకంటే బలుసాకురా వెధవా!!

నన్ను పిచ్చివాణ్ణంటారా? మీ పోయికాలం మండా? నా కుద్యోగమిప్పించలేరూ? నువ్వు బోర్డు మెంబరువేమో? నువ్వు శాసన సభా సభ్యుడవేమో" ఆ సభ్యులంతా సభ్యులా? అన్నదమ్ముడికి అన్యాయం చేస్తారా? నన్నుచూసి నా వెనక నవ్వుకుంటారూ? నాకో పెళ్ళి తెచ్చుకుంటే ఇచ్చి

మంటారూ? నాకు భోజనం లేకపోతే నా ఇంట్లో దెయ్యాలై కూచుంటారూ? మీయమ్మా శిఖాకొయ్యా!" అంటూ పిచ్చివాడు చాలాసేపు పేలాపన సాగించాడు.

మంచు మాయమై ఎర్రగా ఎండ వీధల్లో విస్తరించింది. నులి వెచ్చని ఎండలో పిచ్చివాడు బొండీ దిమ్మ ఎక్కి ముడుచుకుని పడు కున్నాడు. చిన్న మైమరపువచ్చింది. నిష్ప్రాచీ అయిన జన్మ. ఇబ్బంది లేకుండా జీవితం వెళ్ళిపోతున్నాది. మానావమానాలకు అతీతమైన జీవితం. పిచ్చెత్తడం ఎత్తింది ఎత్తదూ?

గెడ్డం తెగమాసివుంది. గీసుకోడానికి బ్లేడులేదు. గుడ్డలు మురికి కంపు కొడుతూ తోళ్ళయి చిరుగులుపట్టి ఉన్నాయి. వీధిలో అడుగుపెట్ట డానికి ఆస్కారంలేదు. కొన్నాళ్ళయి ఇంట్లో భోజనాలులేవు. పొద్దున్నే ఇంటికి చుట్టాలు దిగబడ్డారు. ప్రొద్దుగ్రుంకివొచ్చిన చుట్టం, ప్రొద్దున్నే పట్టిన వాన! వీధిలో ఇరుగుపొరుగుల్ని పరపతిలేదు. ఊళ్ళో మర్యాద లేదు. ఆస్తులున్నాయా? ఉద్యోగమున్నాదా?

రెండోకంటికి తెలియకుండా ఇంట్లో చెంబు, తప్పేలా తాకట్టుపెట్టి రూపాయి డబ్బులు పట్టుకెళ్ళి ఉప్పుతో తొమ్మిది కొని వచ్చిన చుట్టాల్ని మధ్యాహ్నం సాగనంపడం అయింది. ఇహ లాభంలేదు. నాకు పిచ్చెత్తు తుంది అనుకున్నాడు. కాస్త సాయంకాలం పడనిచ్చి వీధిలోకి బయలు దేరేడు. కిందికి చూస్తూ వెళ్ళాడు. కింద ఉమ్ములుతప్ప చిల్లిగవ్వ కనబడ లేదు. నడిచి రైలుస్టేషన్‌కెళ్ళి వచ్చే రైలు పోయే రైలు చూశాడు.

అక్కడ ఒక మిత్రుడు కనబడ్డాడు. వాడేమనుకొన్నాడు? "అర్రర్రే! వీడికి పిచ్చెత్తిందా?" అని వాడిలో వాడు పైకే అన్నాడు.

"ఇంకా నాకు పిచ్చెత్తలేదు. ఇహ నెత్తాలి. ఎత్తవలసిన అవసరం ఉంది. ఎత్తుతుందిలే" అని స్నేహితుడికి చెప్పాడు. "నాకు పిచ్చెత్తిందా? నాకు పిచ్చెత్తుతుంది" ఆత్మప్రబోధం చేసుకున్నాడు.

"సరేలే" అని స్నేహితుడు తప్పుకుంటున్నాడు.

"ఒరే పలకరించినవాడివి పలకరించావు. ఒక్క బేడ ఉంటే ఇద్దూ" అన్నాడు. స్నేహితుడు ఏమనుకున్నాడో వెంటనే బేడతీసి ఇచ్చాడు.

"ఒక్క సిగరెట్టు కూడా పారీ. నాలిక జిల్లార్చుకు పోతున్నాది." అన్నాడు. స్నేహితుడు సిగరెట్టుకూడా ఇచ్చాడు.

"నిప్పో?" అన్నాడు. స్నేహితుడు తాను కాలుస్తున్న పీక ఇచ్చి చల్లగా వెళ్ళిపోయాడు.

రెండణాలు, ఒక సిగరెట్టు గణించాడు. అదే వాడి ప్రప్రథమ స్వార్జితం.

అదే వాడి జీవితంలో అదృష్టానికి ప్రారంభం. పిచ్చికి నాంది. కొత్తలో ప్రతివాళ్ళూ వాణ్ణి పిలిచి అవ్వాకులు చెవ్వాకులు పేలించి తిండి పెట్టేవారు. ఊరు ఊరందరికీ వాడిమీద ఎక్కడలేని అభిమానం పుట్టు కొచ్చింది.

అంతా విచారించేవారు. పాపం పిచ్చెత్తిపోయాడు. చదువుకున్నాడు. తెలివైనవాడు. ముందుకు రావలసినవాడు. చిన్నవాడు.

అంతా కొత్తలోనే. వీధివీధినీ అతనికి బంధువులే. వీధివీధిని అతనికి స్నేహితులే. పిలిచి అయ్యో అని ఆదరించేవారు కొత్తలో. తరవాత తరవాత పిచ్చివాడు ఎవరికి ఏమీ కానివాడై పోయి తనకితానై పోయాడు.

విచిత్రం! మెదడు కన్నం పడిపోయి, మతిభ్రంశం అయిపోయినా ఉదరం అన్నాన్ని అన్వేషిస్తుంది - అన్నం పరబ్రహ్మ స్వరూపం – అందుకు అన్వేషణ తప్పదు! పరబ్రహ్మాన్ని అన్వేషించడమే జీవిత లక్ష్య మని అన్ని మతాలూ అంగీకరిస్తాయి.

పిచ్చివాడు అన్నానికి తిరిగేడు తిరిగేడు - ఊరల్లా తిరిగేడు. ఆఖ రికి బజారు వెనక, మరుగుదొడ్ల వీధిలో అన్నపూర్ణ కటాక్షమైంది – అక్కడే స్థిరనివాసం ఏర్పడ్డాది.

ఇదిగో ఇవ్వాళ తిండేకాక బట్ట కావలసివచ్చి ఊరుమీదపడ్డాడు - ఎండలో పడుకున్నాడు-అపరాహ్ణం తిరిగింది-వాడు ముదిరిన ఎండకి దిగ్గుమని లేచాడు - సమయం ఆసన్నమైంది - పెరటి గుమ్మం దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. రెండు చెవులూ పెట్టుకుని, కళ్ళు ముయ్యకుండా వింటున్నాడు.

ఎత్తు బొండీలోంచి కాలువలోకి జారుతున్న నీళ్ల జమికలు వాయి స్తున్నవి. మురికి కాలువలోకి దొర్లుతున్న నీళ్ళ దరువులు పాడుతున్నాయి.

పక్కజారిన దూడ సగం కాలువలోకి సగం రోడ్డుమీదా పడి కాళ్ళు కూడదీసుకోలేక గిజగిజ తన్నుకు చస్తూ ఉంటే దాని మెళ్ళో మువ్వలు ముచ్చటగా మోగుతున్నాయి.

గోడవతల మనిషి వస్తున్న చప్పుడైంది. ఆ కాలి చప్పుడు పిచ్చివాడికి బాగా తెలుసు-వాడి మొహంలో బ్రహ్మతేజస్సు తాండవించింది. మనిషి వస్తున్న చడి ఆగింది - ఇహ నొచ్చి పడుతుంది! గోడమీంచి ఎగిరి, పెద్ద రాబందులాగ నూరు రెక్కలతో కిందికి దిగుతూ బరువుగా వొచ్చిపడ్డాది-పిచ్చివాడు రెండు చేతులా రామబంధువుని కింద పడకుండా అందుకుని గుండెలకి అదిమి పట్టుకున్నాడు - ఆంధ్ర రాజుల మిలిటరీ భోజనశాల యొక్క మధ్యాహ్నపు ఎంగిలాకులకట్ట!